క్లుప్తంగా

నరసింహస్వామికి అభిషేకం



పొదలకూరు: స్వాతి నక్షత్రం సందర్భంగా స్థానిక శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం నరసింహ స్వామికి అభిషేకం నిర్వహించారు. ఉభయకర్తలుగా నాగసూరి శ్రీనివాసులు – రజని, వెంకటేష్ – అలేఖ్య, సుజీవన్ – అనూష దంపతులు వ్యవహరించారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామికి ప్రత్యేకపూజలు, పల్లకి సేవ జరిగింది.

లాడ్జిలు, హోటళ్ల యాజమానులకు నోటీసులు



మేనేజర్లతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని పలు లాడ్జిలు, హోటళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు మకాం వేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో నేరనియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు నగర డీఎస్పీ సింధు ప్రియ నేతృత్వంలో నగర పోలీస్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని లాడ్జీలు, హోటళ్లలో క్షుణ్ణంగా తనిఖీలను నిర్వహిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవంటూ నోటీసులను జారీ చేస్తున్నారు. చిన్నబజారు స్టేషన్ పరిధిలోని లాడ్జిలు, హోటళ్ల మేనేజర్లతో సమావేశాన్ని ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు నిర్వహించి నోటీసులను అందజేశారు. లాడ్జిల్లో బసచేసే వ్యక్తుల వివరాలను పోలీస్‌స్టేషన్లో రోజూ సమర్పించాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే తెలియజేయాలని సూచించారు.

స్కానింగ్ కేంద్రాలపై ముమ్మర తనిఖీలు



నెల్లూరు(అర్బన్): గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలను జిల్లాలో అరికట్టేందుకు గానూ స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్స్‌ను ముమ్మరంగా చేపడుతున్నామని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. పీసీ, పీఎన్డీటీ చట్టం అమలుపై నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఆకస్మికంగా తనిఖీలు చేసేందుకు గానూ ఎనిమిది మంది అధికారులను ప్రత్యేకంగా నియమించామని చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీష్, కమిటీ సభ్యులు డాక్టర్ పద్మజ, కరిముల్లా, డివిజనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్, డెమో అధికారి కనకరత్నం, ఎన్జీఓలు కవితారెడ్డి, ఇరగబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం సరే.. అభివృద్ధి ఏదీ?

- కసుమూరు దర్గా వద్ద భక్తులకు వసతులు కరువు
- అధ్వానంగా పారిశుద్ధ్యం
- పట్టించుకోని వక్ఫ్ బోర్డు

కసుమూరు దర్గా.. దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందింది. దీనికి హుండీల ద్వారా ఆదాయం బాగానే సమకూరుతోంది. కానీ భక్తులకు వసతుల కల్పనలో వక్ఫ్ బోర్డు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. సిబ్బంది జీతాలకు రూ.లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్టుగా లెక్కలు చెబుతున్నారు. పారిశుద్ధ్యంపై మాత్రం దృష్టి పెట్టడం లేదు. దీంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



దర్గా వెనుక వైపు చెత్తనిల్వలు



తాగునీటి కుళాయిల వద్ద ఇదీ పరిస్థితి

వెంకటాచలం: మస్తాన్‌వలీ దర్గా కసుమూరు గ్రామంలో ఉంది. ఇక్కడ భక్తుల తాకిడి అధిక సంఖ్యలో ఉంటుంది. గురు, శుక్ర, ఆదివారాల్లో మస్తాన్‌వలీ దర్శనం కోసం ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాది మంది వస్తుంటారు. అయితే దర్గా వద్ద వసతులు కల్పించే విషయంపై వక్ఫ్ బోర్డు దృష్టి సారించకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల వసతి సక్రమంగా లేదు. నీటి కోసం నానా అవస్థలు పడుతున్న పరిస్థితులున్నాయి. సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి.

సిబ్బంది పేరుతో దోపిడీ

హుండీ వేలం పాటల ద్వారా రాబడి రూ.1.70 కోట్లకు పెరిగినా దర్గాలో వసతులు మాత్రం మెరుగుపడటం లేదు. వేలం ద్వారా వచ్చిన నగదులో 60 శాతాన్ని దర్గా అభివృద్ధికి వక్ఫ్ బోర్డు అధికారులు కేటాయించాల్సి ఉంది. సిబ్బందిని నియమించి దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య లేకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. కాగా గతేడాది మే నెల నుంచి బోర్డు పర్యవేక్షణలోనే హుండీ కానుకలను లెక్కిస్తున్నారు. అయితే ఈ నగదును చాలా మొత్తాన్ని సిబ్బంది జీతాలుగా లెక్కలు చూపుతున్నారు. అయితే దర్గా వద్ద వాచ్‌మెన్లు,"సిసిబ్బంది ముగ్గురు మాత్రమే ఉండగా బోర్డు అధికారులు మాత్రం ఎక్కువమంది ఉన్నట్లుగా చూపుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. దర్గా చెరువుకట్టపై నెలల తరబడి చెత్తనిల్వలు ఉండటంతో భక్తులు దుర్వాసనను భరించలేకపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుసార్లు సూపరింటెండెంట్‌కు చెప్పినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య సమస్య గురించి బోర్డు అధికారుల వైపు నుంచి స్పందన లేకపోవడంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కొంతమేర పనులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని దర్గా అభివృద్ధిపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.



కసుమూరు దర్గా ముఖద్వారం

పట్టించుకోవడం లేదు

మస్తాన్‌వలీ దర్గా వద్ద వసతుల గురించి వక్ఫ్‌బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదు. హుండీ ద్వారా ఏటా రూ.కోట్లు వస్తున్నా వసతులు, పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించడం లేదు. పంచాయతీ సిబ్బంది చేత దర్గా పరిసర ప్రాంతాల్లో శుభ్రం చేయిస్తున్నాం. వక్ఫ్ బోర్డు అధికారులు చొరవ తీసుకుని దర్గాకు వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలి.

– కడివేటి శివ, కసుమూరు గ్రామ సర్పంచ్



చర్యలు తీసుకుంటాం

కసుమూరు దర్గా వద్ద పారిశుద్ధ్య సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. దుకాణాల వద్ద కాలువల్లో సమస్య ఉంది. ఈ విషయంపై వాటి యజమానులతో మాట్లాడాం. ఎలాంటి సమస్య లేకుండా పరిష్కరిస్తాం.

- అస్లాం, దర్గా పర్యవేక్షకుడు

డిగ్రీ పరీక్షలకు 67 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 67 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎగ్జామ్స్ అధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 750 మందికి గానూ 683 మంది హాజరయ్యారని వెల్లడించారు.

రికార్డుల పరిశీలన

పొదలకూరు: నెల్లూరు డివిజనల్ పంచాయతీ అధికారి రమణయ్య మంగళవారం పొదలకూరు పంచాయతీ రికార్డులను పరిశీలించారు. నిధులు గోల్‌మాల్ అయ్యాయని కొందరు ఇటీవల రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో రెండో విడత రికార్డులను పరిశీలించేందుకు విచ్చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ఖర్చు తదితర రికార్డులను డీఎల్‌పీఓ చూశారు. మేజర్ పంచాయతీ కావడంతో ఇప్పట్లో రికార్డుల పరిశీలన, విచారణ పూర్తి కాదని ఆయన వెల్లడించారు.

విద్యార్థులకు అభినందన



సర్టిఫికెట్లను అందజేస్తున్న శశికాంత్‌రెడ్డి

కొడవలూరు: నార్తురాజుపాళెంలోని శశికాంత్ రెడ్డి ఫార్మసీ కళాశాలలో బీ – ఫార్మసీ ద్వితీయ సంవత్సరంలో ప్రతిభ కనబర్చి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్ శశికాంత్‌రెడ్డి మంగళవారం అభినందించారు. వెంకటేష్ 93, పావని 90 శాతం మార్కులను సాధించడంతో వీరికి అకడమిక్ ఎక్సలెన్సీ సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపల్ హరిభాస్కర్, వైస్ ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాలి



మాట్లాడుతున్న ఏఓ వాసు



రైతులతో సమావేశమైన పట్టాభిరామిరెడ్డి

పొదలకూరు: రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాల్సిందిగా ఏఓ ఎ.వాసు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాటిపర్తి, మహ్మదాపురం ఆర్‌ఎస్‌కేల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించుకోవాలనుకున్న రైతులు కోతలకు వారంరోజుల ముందుగా ఆర్‌ఎస్‌కేల్లో షెడ్యూలింగ్ చేయించుకోవాల్సిందిగా పేర్కొన్నారు. సాధారణ రకానికి (కామన్) పుట్టికి రూ.19,550, గ్రేడ్ ఏ రకం పుట్టికి రూ.19,720 మద్దతు ధరను అందజేస్తారన్నారు. రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. దీనివల్ల భవిష్యత్‌లో ఎన్నో ఉపయోగాలున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈఓ ఏడుకొండలునాయక్, రైతులు పాల్గొన్నారు.

దళారులపాలు చేయొద్దు

ధాన్యాన్ని దళారులపాలు చేసుకుని రైతులు నష్టపోవద్దని ఏపీ సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి సూచించారు. మండలంలోని తాటిపర్తి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పట్టాభిరామిరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రం, ధాన్యం అమ్మకాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధరలు తగ్గుతున్న నేపథ్యంలో అన్నదాతలు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్న ధాన్యం తేమశాతం, కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు ధాన్యం సేకరించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలను పొందాల్సిందిగా సూచించారు. నేరుగా దళారులు, మిల్లర్లకు అమ్ముకుంటే రకరకాల సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

భూ ఆక్రమణను అడ్డుకోవాలని వినతి

పొదలకూరు: తమ పొలాన్ని ఆక్రమిస్తున్నారని మండలంలోని దుగ్గుంటరాజుపాళెం గ్రామానికి చెందిన ఎస్టీ, బీసీలు మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దార్ సురేఖకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో డీ– ఫాం పట్టాలను 11 మందికి పంపిణీ చేసినట్టు తెలిపారు. పట్టాలు మంజూరు చేయడంతో పంతగిరి శ్రావణి, మల్లిక హనుమాయమ్మ, గడ్డం సౌజన్య, కల్లూరు అంకమ్మ, బూదూరు పెంచలమ్మ, పలుకూరు రమాదేవి, పంతగిరి బాలసుబ్రమణ్యం, అట్ల పద్మమ్మ, వాసిలి రమణయ్య, కొండూరు ధనమ్మ, మందారపు గీత పేర్లు అడంగళ్, వన్‌బీలో కూడా చేర్చడం జరిగిందన్నారు. అయితే భూమి సబ్ డివిజన్ చేయలేదని, దీంతో రాపూరు మండలం ఆదూరుపల్లి గ్రామానికి అంకయ్య డీ – ఫాం పట్టాలు కలిగిన తమ భూమిని ఆక్రమించి యంత్రాలతో చదును చేయిస్తున్నట్టు తెలిపారు. నిమ్మ మొక్కలను పొలంలో నాటేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు వెల్లడించారు. పొలాలను సబ్‌డివిజన్ చేసి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

రేబాల ఉన్నత పాఠశాలలో పరిశీలన




బుచ్చిరెడ్డిపాళెం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష ఏఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రేబాల ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. పాఠశాలలోని ల్యాబ్‌ను ఎలా ఉపయోగిస్తున్నారనే అంశమై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చేజర్ల: మండలంలోని కొల్లపనాయుడుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి అనే వ్యక్తికి తన అన్న కొడుకులతో కొద్దికాలంగా పొలం, తోట విషయంలో తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో శివశంకర్ రెడ్డి తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రస్తుతం అతను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఎస్సై తిరుమలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగోన్నతులకు కౌన్సెలింగ్



నెల్లూరు(అర్బన్): సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్ – 3 ఏఎస్‌ఎంలకు ఎంపీహెచ్ డబ్ల్యూ – ఎఫ్‌గా ఉద్యోగోన్నతులను కల్పించేందుకు గానూ కౌన్సెలింగ్‌ను మంగళవారం నిర్వహించారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాత అందజేశారు. మొత్తం 289 మంది ఉద్యోగోన్నతులను పొందారని ఆమె చెప్పారు.

పెరిగిన నిమ్మ ఎగుమతులు



మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు: నిమ్మ ఎగుమతులు పెరుగుతున్నాయి. ఫలితంగా ధరలు నిలకడగా ఉన్నా మార్చి నెలలో రైతులు ఆశించిన స్థాయిలో పెరగడం లేదు. సాధారణంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో ధరలు బాగా పెరిగితే రైతులు ఆర్థికంగా కొంతమేర నిలదొక్కుకుంటారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.50 నుంచి రూ.80 వరకు ఉంది. టాప్ ధర బస్తా (లూజు) ఒకటి రూ.6,500 వరకు ఉన్నట్టు రైతులు వెల్లడించారు. అయితే ఈ సీజన్లో ధరలు ఇంకా పెరగాల్సి ఉంది. మార్చినెలలో రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ధరలు పలికిన సందర్భాలున్నాయి. రెండు వారాల క్రితం బస్తాకు రూ.9 వేలు రావడంతో ధరలు ఇలాగే కొంతకాలం కొనసాగుతాయని రైతులు ఆశపడ్డారు. ఢిల్లీ మార్కెట్‌కు తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా నకిరేకల్ మార్కెట్ నుంచి విపరీతంగా కాయలు ఎగుమతి అవుతున్నాయి. దీంతో ఎగమతులు బాగా పెరిగి ధరలు పతనమవుతున్నట్టు వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. నకిరేకల్ పరిసర ప్రాంతాల్లో నిమ్మతోటలు అధిక సంఖ్యలో ఉన్నట్టు సమాచారం. ఆ ప్రాంతం రైతులు నిమ్మ దిగుబడులను బాగా సాధించడం వల్ల ఎగుమతులు పెరుగుతున్నాయి. సాధారణంగా నకిరేకల్ ప్రాంతంలో మార్చినెలలో ఆశించిన స్థాయిలో కాయల దిగుబడి ఉండదు. ఈ ఏడాది దిగుబడి పెరగడంతో ఢిల్లీ మార్కెట్‌కు బాగా ఎగుమతులు పెరిగినట్టు తెలుస్తోంది.

ఏప్రిల్ మూడో వారంలోపు రీసర్వే పూర్తి

- జేసీ కార్తీక్



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న జేసీ

మనుబోలు: జిల్లాలో ఎంపిక చేసిన 35 గ్రామాల్లో ఏప్రిల్ మూడో వారంలోపు రీసర్వేను పూర్తి చేస్తామని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. మండలంలోని పిడూరు గ్రామంలో జరుగుతున్న సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిడూరు గ్రామంలో ప్రస్తుతం భూమి కొలతలను తీసుకున్నామని తెలిపారు. ప్రతి పట్టాదారుడికి భూ విస్తీర్ణం కొలతలు నిర్ధారించేందుకు 92 నోటీసులను జారీ చేస్తామన్నారు. రైతులు వాటిని తీసుకుని భూమి విస్తీర్ణం సరిచూసుకోవాలని తెలిపారు. అందులో ఏవైనా తప్పులుంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే సరిచేస్తారన్నారు. భూమి విస్తీర్ణం ఎంత, ఎవరి ఆధీనంలో ఉంది? తదితర వివరాలను ఇదివరకే సేకరించినట్లు తెలిపారు. అవకతవకలకు ఆస్కారం లేకుండా పక్కా సర్వేను పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ సుబ్బయ్య, డీటీ మంజుల, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ శ్రీకాంత్, వీఆర్వో శ్రీనివాసులు తదితరులున్నారు.

విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్



సీపీఎం అధ్వర్యంలో ఆందోళన చేస్తున్న దళితులు

మనుబోలు: రాష్ట్ర గిడ్డంగుల సంస్థలో నైట్ వాచ్‌మెన్ విధుల్లోకి రాజగోపాల్‌ను వెంటనే తీసుకోవాలని సీపీఎం నాయకుడు తలారి దేవదానం డిమాండ్ చేశారు. రాజగోపాల్ తొలగింపునకు నిరసనగా మంగళవారం గిడ్డంగుల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో దళితులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జట్ల కొండూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఎస్‌డబ్ల్యూసీలో దళితుడైన రాజగోపాల్ ఆరు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడని తెలిపారు. అతను వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరుడిగా ఉన్నాడనే అక్కసుతో అకారణంగా విధుల తొలగించారని ఆరోపించారు. స్థానిక టీడీపీ నాయకుడు వెందోటి భాస్కర్ రెడ్డి ఒత్తిడితోనే ఎస్‌డబ్ల్యూసీ ఆర్‌ఎం, మేనేజర్‌లు రాజగోపాల్‌ను అన్యాయంగా తొలగించారని విమర్శించారు. బాధితుడు స్వయంగా వెళ్లి ఎమ్మెల్యే సోమిరెడ్డికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. ఉద్యోగం నుంచి తొలగించడంతో అతడి కుటుంబం వీధిన పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

బురద నీటిలో రాకపోకలెలా?



అండర్ పాస్ వద్ద నిల్వ చేరిన బురద నీరు

మనుబోలు: బురద నీటిని దాటుకుని ఎలా వెళ్లాలంటూ జట్ల కొండూరువాసులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని జట్ల కొండూరు గ్రామానికి, జాతీయ రహదారికి మధ్య రైల్వే ట్రాక్ ఉంది. గ్రామానికి వెళ్లేందుకు ట్రాక్ కింద నుంచి అండర్ పాస్ నిర్మించారు. అయితే సమీపంలోని చెరువు నుంచి నీటి ఊట అండర్‌పాస్ వద్దకు చేరి నిల్వ చేరిపోతోంది. దీంతో బురద నీటిలో అవతలి వైపునకు వెళ్లేందుకు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే రైల్వే అధికారులకు కూడా ఫిర్యాదు చేశామని ఉప సర్పంచ్ తులసీరాం తెలిపారు. అండర్ పాస్ నిర్మించే సమయంలో రైల్వే కాంట్రాక్టర్ కేవలం 30 మీటర్ల దూరం మాత్రమే డ్రెయినేజీ నిర్మించడంతో అక్కడికి చేరిన బురద నీరు బయటకు వెళ్లడం లేదన్నారు. డ్రెయినేజీని మరింత దూరం విస్తరించాలని కోరారు.

గిరిజనులకు ఆధార్ చేయించాలి



సూచనలిస్తున్న వంశీకృష్ణ

కొడవలూరు: ఆధార్ లేని గిరిజనులను గుర్తించి ఆధార్ చేయించాలని కావలి ఆర్డీఓ వంశీకృష్ణ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన అనంతరం అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడారు. గిరిజనుల్లో కొందరికి ఆధార్ లేదనే ఫిర్యాదులొస్తున్న నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించాలని సూచించారు. ఆధార్ లేని పక్షంలో ప్రభుత్వమిచ్చే అనేక పథకాలకు వారు దూరమవుతారన్నారు. గృహాల్లేని గిరిజనులను గుర్తించి మంజూరు చేయాలని చెప్పారు. గ్రీవెన్స్‌లో వచ్చే వినతులు, రీసర్వేపై విజ్ఞప్తులపై ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి, ఎంపీడీఓ వెంకటసుబ్బారావు, హౌసింగ్ ఏఈ ముక్తార్‌బాషా, డీటీ సారంగపాణి, ఆర్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

- విధులకు హాజరు కాకుండానే వచ్చినట్లు సంతకాలు
- బుధవారం హాజరును మంగళవారమే వేసిన వైనం
- ఎంపీపీ తనిఖీలో సిబ్బంది వ్యవహారం బట్టబయలు



19వ తేదీకి హాజరు వేసిన సిబ్బంది

చేజర్ల: మండలంలో ఉపాధి హామీ సిబ్బంది పనితీరు ఇష్టారాజ్యంగా మారింది. కొందరు సిబ్బంది రేపటికి కూడా ముందు రోజే హాజరు వేసి డ్యూటీకి రాకుండా ఎగనామం పెడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సిబ్బంది గైర్హాజరై వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చేజర్ల మండల పరిషత్ కార్యాలయాన్ని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం సందర్శించి అక్కడి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సదరు కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్లు రఘురామయ్య, జానీబాషా ఇద్దరూ 19వ తేదీకి సంబంధించి ముందే సంతకాలు చేసుకున్నారు. అంతే కాకుండా తనిఖీ సమయంలో కూడా వారు విధులకు డుమ్మా కొట్టారు. ఇదేమని ప్రశ్నించేందుకు అక్కడి సిబ్బంది కూడా ఎవరూ లేకపోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీపీ తెలిపారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.